క్లుప్తంగా

విద్యాసామగ్రి పంపిణీ


విద్యాసామగ్రి అందజేస్తున్న సొసైటీ సభ్యులు

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెం గిరిజనకాలనీ పాఠశాలలో చదువుతున్న బాలబాలికలకు బుచ్చిరెడ్డిపాళెం సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నోట్ పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు పఠాన్‌బాషా సాహెబ్, గజేంద్రకు ఆ సొసైటీ అధ్యక్షుడు యస్దానీబాషా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ ఖాదర్‌బాషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన


నాడు- నేడు పనులు పరిశీలిస్తున్న అధికారులు

సీతారామపురం: మండలంలోని పండ్రంగి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను మంగళవారం ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఎంఈఓ మస్తాన్‌వలి పరిశీలించారు. నత్తనడకన జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై ప్రధానోపాధ్యాయుడు బాలిరెడ్డితో మాట్లాడి పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన భోజనం అందించాలన్నారు.

నివాళి



కావలి: కావలి పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి, బాలసుబ్రహ్మణ్యం ఆర్ట్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు లేబాకుల సుధాకర్‌రెడ్డి మృతిచెందిన నేపథ్యంలో మంగళవారం కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి.. సుధాకర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఎమ్మెల్యే కాకర్లకు ఘన స్వాగతం


కాకర్లకు ఘన స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

ఉదయగిరి: ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్ అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొట్టమొదటిగా ఉదయగిరి నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా మంగళవారం సాయంత్రం జలదంకి మండలం జమ్మలపాళెం వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి జలదంకి, కలిగిరి మీదుగా వింజమూరులోని పార్టీ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు: వాతావరణంలో మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ తోట వెంకట కృష్ణకుమారి, ఈఓపీఆర్డీ సికిందర్ సూచించారు. వారు మంగళవారం వరికుంటపాడు మండలంలోని రామాపురం గ్రామ సచివాలయంలో డయేరియా నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల మధ్య చెత్త నిల్వ ఉండకుండా చూసుకునేలా ప్రజలను చైతన్యపరచాలని, తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని కనియంపాడులో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆ నీరు తొలగించేలా సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

సీతారామపురం: మండలంలోని మారంరెడ్డిపల్లి ఎస్సీకాలనీలో సోమవారం మృతిచెందిన టీడీపీ నాయకుడు కలివెల దానమయ్య కుటుంబాన్ని మంగళవారం ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు జ్యోతి, నాయకులు చంద్రారెడ్డి, జాషువా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలస్వామి, కిరణ్, బాబు తదితరులు ఉన్నారు.

డ్రాపౌట్స్ లేకుండా కృషి చేయండి

సీతారామపురం: గ్రామాల్లో డ్రాపౌట్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని పండ్రంగి ఎస్టీకాలనీలో పర్యటించి 'నేను బడికి పోతా' కార్యక్రమంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6–14 ఏళ్ల లోపు వయస్సు గల బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు అందే సౌకర్యాలు, ఉత్తమ బోధనపై వివరించారు. అనంతరం పలువురు డ్రాపౌట్స్‌ను గుర్తించి స్థానిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ మస్తాన్‌వలి, ప్రధానోపాధ్యాయుడు బాలిరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగరాజు, సీఆర్పీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


సీతారామపురం: పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌వలి

అవగాహన ర్యాలీ

ఉదయగిరి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు మంగళవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి 'నేను బడికి పోతా' కార్యక్రమంపై ఉదయగిరి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా పంచాయతీ బస్టాండ్‌కు చేరుకుంది. అనంతరం విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి, హెచ్‌ఎంలు బాలకేశవులు, షబ్బీర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంగమాంబపురంలో..

వరికుంటపాడు: 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా వరికుంటపాడు మండలంలోని వెంగమాంబపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-1 షాఉద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సౌకర్యాలు కల్పించారని, గ్రామంలో బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేయాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ మాలకొండయ్య, హెచ్‌ఎం ఆర్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు గురవయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కలిగిరి: 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు సూచించారు. కలిగిరిలోని జెడ్పీ హైస్కూల్ నుంచి కలిగిరమ్మతల్లి ఆలయం వరకు విద్యార్థులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.సురేష్, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

ఆత్మకూరురూరల్: బడి బయటి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతూ మంగళవారం ఆత్మకూరు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని పేరారెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం సోమవరపు భాస్కర్‌రెడ్డి, పేరారెడ్డిపల్లి సచివాలయం ఎడ్యుకేషన్ అసిస్టెంట్ గురజాల శాంతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


కలిగిరి: ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ తదితరులు


ఆత్మకూరురూరల్: పేరారెడ్డిపల్లిలో..

బడి ఈడు పిల్లలను బడులకు పంపండి

అల్లూరు: బడి ఈడు పిల్లలను బడికి పంపాలని ఎంఈఓలు రవీంద్రనాథ్, సునీత అన్నారు. స్థానిక రామాపురం గిరిజనకాలనీలో 'నేను బడికి పోతా' కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అల్లూరు: రామాపురం గిరిజనకాలనీలో..



ఉదయగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


వరికుంటపాడు: ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ, విద్యార్థులు

ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ నరసారెడ్డిపాళెంలో 104 వాహనం ద్వారా వైద్యాధికారి షేక్ మస్తాన్‌బాషా ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ 104 వాహనంలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

బాధ్యతగా విధులు నిర్వహించండి

వరికుంటపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో బాధ్యతగా విధులు నిర్వహిస్తూ మంచిపేరు తెచ్చుకోవాలని ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓ రాజశేఖరరాజు సూచించారు. ఆయన మంగళవారం వరికుంటపాడులో సిబ్బందితో సెక్టారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డుల నిర్వాహణ సక్రమంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పీహెచ్‌ఎన్ సుశీలమ్మ, పర్యవేక్షకులు వెంకటయ్య, మేరీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మర్రిపాడు: అనంతసాగరం సబ్‌స్టేషన్‌లో నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో బుధవారం మర్రిపాడు మండలంలోని పడమటినాయుడుపల్లి, రాజుపాళెం, కేఎన్‌పల్లి, చుంచులూరు గ్రామాల్లో, 33/11 కేవీ కేతిగుంట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పొంగూరు, పల్లిపాడు, కేతిగుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మర్రిపాడు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ జి.రామచంద్రయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన కలిశెట్టి జ్ఞాపిక, ఇందూరు లక్ష్మీప్రసన్న, పవన్‌కళ్యాణ్‌లకు క్రీ.శే. వేమన ఓబయ్య, జయరత్నమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు శ్యాంప్రసాద్, వెంకటసురేష్, కృష్ణకిషోర్ మంగళవారం రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ జొన్నా సత్యనారాయణ, విశ్రాంత హెచ్‌ఎం కలిశెట్టి వెంకటరమణయ్య, కలిశెట్టి రాజేంద్రకుమార్, వనం నరసింహులు, ఉపాధ్యాయులు డీవీ రమణయ్య, అశోక్, పెంచలరావు, మల్లికార్జునస్వామి, శివశంకరయ్య, చైతన్య మురళీకృష్ణ, నయీం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


నగదు బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

మినీ వాటర్ స్కీం పరిశీలన

సీతారామపురం: మండలంలోని పండ్రంగి ఎస్టీకాలనీలో ఉన్న మినీ వాటర్ స్కీంను మంగళవారం ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల దృష్ట్యా సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరవని తెలిపారు. ఆయన వెంట పీఆర్ ఏఈ బాలినేని ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి జీవన్ ఉన్నారు.

ఘనంగా అంగారక సంకట హర చతుర్ధి


పంచముఖ శక్తి గణపతికి పూజలు చేస్తున్న భక్తులు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లిలో ఉన్న శ్రీపంచముఖ శక్తి గణపతి దేవస్థానంలో మంగళవారం అంగారక సంకట హర చతుర్ధి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీసీపల్లి గ్రామానికి చెందిన రేవూరు నారాయణరెడ్డి – పద్మావతి, గండ్లవీడుకు చెందిన కొల్లి దొరస్వామినాయుడు – సుస్మిత దంపతులు ఉభయకర్తలుగా తమ కుటుంబసభ్యులతో కలిసి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పొశర్లపూడి వెంకటేశ్వరశర్మ స్వామివారిని గజమాలలు, గరికమాలలు, సుగంధ పరిమళ భరిత పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

వేడుకగా గంగాభవాని అమ్మవారి ఉత్సవాలు


పందెం బండ లాగుతున్న ఎద్దు


ప్రత్యేక అలంకరణతో గంగాభవాని అమ్మవారు

- ఆనందోత్సాహాలతో ఎడ్ల బండలాగుడు పోటీలు

ఉదయగిరి: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో శ్రీఅనంతపురి గంగాభవాని అమ్మవారి ఉత్సవాలు మంగళవారం బండ్లు పొంగళ్ల కార్యక్రమంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి అలంకరణ, ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, బండ్లు పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

గంగాభవాని అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మూడు జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలను గ్రామానికి చెందిన మన్నేటి వెంకటలక్ష్మి-శ్రీలక్ష్మి దంపతులు ప్రారంభించారు. నంద్యాల జిల్లా కుమ్మరికొట్టాలు గ్రామానికి చెందిన వినుకొండ రఫీ ఎద్దు 2,174.02 అడుగుల దూరం బండలాగి విజేతగా నిలిచాయి. వైఎస్సార్ జిల్లా రాజువారిపేట గ్రామానికి చెందిన లింగారెడ్డి హిశ్వతి ఎద్దు 1,301 అడుగుల దూరం బండలాగి ద్వితీయస్థానంలో, వైఎస్సార్ జిల్లా వత్తూరు గ్రామానికి చెందిన కవ్వా బాలయ్య ఎద్దు 1,213.02 దూరం బండలాగి తృతీయస్థానంలో నిలిచాయి. వీరికి ఆలయ కమిటీ సభ్యులు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సభ్యత్వ నమోదు

మర్రిపాడు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మర్రిపాడు మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పాలా రవీంద్రారెడ్డి, మైలి వెంకటేశ్వర్లు, మందా బ్రహ్మారెడ్డి, ఎం.రమేష్, రాధాకృష్ణ, చల్లా హరీష్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పీడీ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: ఆంధ్ర ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం ఆత్మకూరు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించారు. అపస్ జిల్లా కార్యదర్శి పట్నం అనిల్‌కుమార్, నాయకుడు పెంచలరెడ్డి తదితరులు బట్టేపాడు, వాశిలి, కనుపూరుపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అపస్ సభ్యత్వం చేయించారు.

డయేరియాపై అవగాహన కల్పించండి

ఉదయగిరి: వైద్య ఆరోగ్య సిబ్బంది డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి శివకల్పన పేర్కొన్నారు. ఆమె మంగళవారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ గ్రామాల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీలు నీటి పరీక్షలు నిర్వహించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో సీహెచ్‌ఓ శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్ చెన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సంగం: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి సూచించారు. మంగళవారం సంగంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విరేచనాలు, వాంతులు ఉన్న వారు వెంటనే స్థానిక పీహెచ్‌సీలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లోరినేషన్‌పై శ్రద్ధ చూపండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

అల్లూరు: గ్రామాల్లో క్లోరినేషన్‌పై అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీఓ జ్యోతి అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. డయేరియా ప్రబలకుండా పరిశుభ్రత చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వీరేంద్ర, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దాడులు చేయడం హేయమైన చర్య


హన్మకొండ రాజీవ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న దాడులు హేయమైన చర్య అని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దుయ్యబట్టారు. టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, మాజీ వలంటీర్ హన్మకొండ రాజీవ్‌కుమార్(నటరాజ్)ను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం కావలిలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కావలి నియోజకవర్గంలో ఎలాంటి అరాచకాలు చేస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి వారిపై, వారి ఆస్తులపై దాడులు చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. హనుమకొండ రాజీవ్‌కుమార్ వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు అనే కారణంతోనే 15 మంది టీడీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేశారని, ఇలాంటి అరాచకాలను ప్రోత్సహించడం ఎమ్మెల్యేకు తగదని అన్నారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించింది అభివృద్ధి చేయడానికి, ప్రజలకు మేలు చేయడానికి మాత్రమే అని, అభివృద్ధికి తాము కూడా సహకరిస్తామని, ఇలాంటి అరాచకాలు సృష్టిస్తే ప్రజలు సహించరని తెలిపారు. కావలి నియోజకవర్గంలో ఒక వర్గానికి చెందిన మీడియా కావలి పట్టణం, మున్సిపాలిటీ పరిధిలో 125 ఎకరాల భూమిని కబ్జా చేశారని, అందుకు తాను సహకరించానని అసత్య ప్రచారం చేస్తున్నారని, అలాంటి కబ్జాలు జరిగి ఉంటే ఆధారాలతో సహా నిరూపించాలన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

సంగం: మండలంలోని పెన్నానది నుంచి ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రమాదేవి హెచ్చరించారు. సంగం మండలంలోని ముక్తాపురం, సంగం, కోలగట్ల గ్రామాల్లోని పెన్నానది నుంచి రాత్రి సమయాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. దీంతో ముక్తాపురం వద్ద పెన్నానదిని మంగళవారం పరిశీలించామని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ఆమె వెంట ఆర్ఐ నారాయణ, వీఆర్ఓ ప్రసాద్ తదితరులు ఉన్నారు.


ముక్తాపురం వద్ద పెన్నానదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

దౌర్జన్యంగా ఇల్లు కూల్చివేత

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లి మజరా బంట్లపల్లి గ్రామంలో దిబ్బగుంట అనే ప్రభుత్వ స్థలంలో 20 సంవత్సరాల క్రితం ఇల్లు కట్టుకొని జీవిస్తుండగా అదే గ్రామానికి చెందిన గండి ఈశ్వరయ్య, కాకుమూరి అజిత్‌కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు దౌర్జన్యంగా తన ఇంటిని కూల్చివేసి తమపై దాడికి ప్రయత్నించారని అదే గ్రామానికి చెందిన సంకల జయరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు బాధితులు మంగళవారం తెలిపారు. తాను, తన కుమారుడు వేర్వేరుగా నివాసం ఉంటున్నామని, తాను ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకొని జీవిస్తుండగా తమ ఇంటిని కూల్చివేసి తమపైనే ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారన్నారు. ఈ విషయమై తాము పోలీసుస్టేషన్‌కు వెళ్లగా అక్కడి పోలీసులు తమను బెదిరించారని.. గత్యంతరం లేక కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లామని బాధితులు తెలిపారు.

వైభవంగా అలఘునాథస్వామి కల్యాణం


అలఘునాథస్వామి కల్యాణం


కల్యాణోత్సవం వీక్షిస్తున్న భక్తులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీఅలఘునాథస్వామి ఆలయంలో మంగళవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు విశ్వనాథం శ్రీనివాసశర్మ, రామయ్య స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని వీక్షించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.